క్లుప్తంగా

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత



జగన్నాథ్, బలదేవ్, సుభద్ర మూర్తులు

కర్నూలు కల్చరల్: ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత కలుగుతుందని ఇస్కాన్ కర్నూలు బాధ్యులు రఘునందన సేవక్ దాస్ అన్నారు. ఆదివారం స్థానిక భగీరథ కాంప్లెక్స్‌లోని పూరి జగన్నాథ మందిరంలో ప్రభుపాదుల ప్రేమ విందు, భగవద్గీత శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లల్లో నైతికత పెంపొందేలా మన ఇతిహాసాల గురించి వివరించాలన్నారు. మానవ జీవితానికి భగవద్గీత మార్గదర్శిగా నిలుస్తుందన్నారు. అనంతరం జగన్నాథ్, బలదేవ్, సుభద్రలకు నైవేద్యం నివేదించి భక్తులకు వితరణ చేశారు.

పేదలందరికీ సొంతిళ్లు నిర్మిస్తా

కర్నూలు(సెంట్రల్): నియోజకవర్గంలోని పేదలందరికీ సొంతిళ్లు నిర్మిస్తానని పాణ్యం సీపీఎం అభ్యర్థి డి.గౌస్‌దేశాయ్ హామీ ఇచ్చారు. ఆదివారం ఎన్నికల ప్రచారంలో భాగంగా నగరంలోని నందూరి ప్రసాదరావు,పూలే అంబేడ్కర్‌నగర్, సమత నగర్,ఫోర్త్ ఎంప్లాయిస్ కాలనీ,సోమిశెట్టి నగర్‌లలో సీపీఐ, ఆమ్‌ఆద్మీ నాయకులు కలిసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు రామకృష్ణారెడ్డి, చంద్రశేఖర్, సీపీఎం నాయకులు పీఎస్ రాధాకృష్ణ, టి.రాముడు పాల్గొన్నారు.

వెలగపూడిలో పోస్టల్ బ్యాలెట్ సెంట్రల్ ఎక్సైజ్ ప్రోగ్రామ్

కర్నూలు (న్యూటౌన్): ఏపీలో మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా పోస్టల్ బ్యాలెట్‌కు సంబంధించి సెంట్రల్ ఎక్సైజ్ ప్రోగ్రామ్ వెలగపూడి సచివాలయంలో జరిగిందని జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ టి.రాజశేఖర్ తెలిపారు. ఆదివారం విజయవాడలోని వెలగపూడి సచివాలయంలో జరిగిన పోస్టల్ బ్యాలెట్‌కు సంబంధించి కార్యక్రమానికి ఆయన పోస్టల్ బ్యాలెట్ అధికారిగా పాల్గొన్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులతో పాటు వివిధ రంగాల్లో పనిచేస్తున్న వారు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకునే అంశానికి సంబంధించి పలు విషయాలను వెల్లడించారన్నారు. ఎన్నికల కమిషన్ నియమ నిబంధనల మేరకు పోస్టల్ బ్యాలెట్ నిర్వహణ ఉంటుందన్నారు.

మహేశ్వరయ్య స్మారక సాహిత్య పురస్కార కమిటీ ఎన్నిక

కర్నూలు కల్చరల్: మహేశ్వరయ్య స్మారక సాహిత్య పురస్కారాన్ని ఎంపిక చేసేందుకు కమిటీని ఎంపిక చేసినట్లు సాహితీ స్రవంతి నాయకులు తెలిపారు. కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా డి.అయ్యన్న, ఆవుల చక్రపాణి యాదవ్, మరికొంత మంది సభ్యులను ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. కమిటీ సమావేశమై పురస్కార గ్రహీతలను ఎంపిక చేస్తుందని తెలిపారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు



కలర్ బెల్టులు ప్రదానం చేస్తున్న కార్డియాలజిస్టు డాక్టర్ చంద్రశేఖర్

కర్నూలు (టౌన్): క్రీడల్లో క్రమం తప్పకుండా సాధన చేస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని కార్డియాలజిస్టు డాక్టర్ పి. చంద్రశేఖర్ స్పష్టం చేశారు. ఆదివారం స్థానిక పాతబస్టాండ్ కొండారెడ్డి బురుజు ఎదురుగా ఉన్న పార్కులో తైక్వాండో బెల్ట్ ప్రమోషన్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఆయన మాట్లాడుతూ మార్షల్ ఆర్ట్స్ వంటి క్రీడల్లో పాల్గొనడం ద్వారా ఆత్మరక్షణతో పాటు క్రమశిక్షణ అలవడుతుందన్నారు. అనంతరం ప్రతిభ చాటిన క్రీడాకారులకు ఆయన కలర్ బెల్టులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తైక్వాండో అసోసియేషన్ జిల్లా సంయుక్త కార్యదర్శి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సాయి సుబ్బయ్య రవీంద్రలో గ్రాడ్యుయేషన్ డే



విద్యార్థులతో సాయి సుబ్బయ్య విద్యా సంస్థల అధినేత సుబ్బయ్య

కర్నూలు సిటీ: స్థానిక మాధవీనగర్, రెవెన్యూ కాలనీల్లోని సాయి సుబ్బయ్య విద్యా సంస్థలు అయిన రవీంద్ర ఇంగ్లిషు మీడియం స్కూల్, రవీంద్ర టాలెంట్ స్కూల్‌లలో ఆదివారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆ విద్యా సంస్థల అధినేత పి.బి.వి. సుబ్బయ్య పాల్గొని ప్రసంగించారు. విద్యార్థులు తమ ప్రతిభను పెంచుకుని చదువుతున్న తరగతులను దిగ్విజయంగా పూర్తి చేసుకున్నారన్నారు. కార్యక్రమంలో స్కూల్ టీచర్లు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

మనసున్న సీఎం జగన్



5 వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఇంతియాజ్, ఎస్వీ మోహన్ రెడ్డి



పెద్ద పడఖానలో రాత్రి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం

- పేదల అభ్యున్నతికి పరితపిస్తారు
- వైఎస్సార్‌సీపీ 2024 మేనిఫెస్టోనే అందుకు నిదర్శనం
- చంద్రబాబుకు ఓటు వేస్తే జగనన్న పథకాలు రద్దు
- ఎన్నికల ప్రచారంలో కర్నూలు అసెంబ్లీ అభ్యర్థి ఇంతియాజ్

కర్నూలు (టౌన్): 'ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మంచి మనసున్న నాయకుడు. ఎప్పుడూ ఆయన పేదలు, బడుగు, బలహీన వర్గాల శ్రేయస్సు కోసం పరితపిస్తారు. ఇందుకు ప్రస్తుతం కొనసాగుతున్న పాలనతో పాటు నూతనంగా ప్రకటించిన 2024 మేనిఫెస్టోనే నిదర్శనం' అని వైఎస్సార్‌సీపీ కర్నూలు ఎమ్మెల్యే అభ్యర్థి ఇంతియాజ్ అన్నారు. ఆదివారం నగరంలోని 5 వ వార్డు రాంబోట్ల దేవాలయం వీధుల్లో మాజీ ఎమ్మెల్యే, కర్నూలు పార్లమెంట్ డిప్యూటీ రీజినల్ కో–ఆర్డినేటర్ ఎస్వీ మోహన్ రెడ్డితో కలిసి ఇంతియాజ్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి జగనన్న మేనిఫెస్టోను అందజేశారు. మరింత మంచి జరగాలంటే వైఎస్సార్‌సీపీకి ఓటు వేయాలని అభ్యర్థించారు. అనంతరం ఇంతియాజ్ మాట్లాడుతూ 2019 సంవత్సరంలో ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నింటినీ 99 శాతం అమలు చేసిన జగనన్న మరోసారి జనరంజకమైన పాలన అందించేందుకు 2024 మేనిఫెస్టో విడుదల చేశారన్నారు. పెన్షనర్లకు రూ.3500 చేయడంతో పాటు మహిళలకు వైఎస్సార్ చేయూత, కాపు నేస్తం, వైఎస్సాఆర్ సున్నా వడ్డీ కింద రూ.3 లక్షలు ఇస్తామని ప్రకటించడం హర్షించదగ్గ విషయమన్నారు. ఆరోగ్య సురక్ష పేరుతో ఇంటి వద్దకే వైద్యం తీసుకువచ్చిన సర్కారు తమదన్నారు. ప్రతి పథకాన్ని మహిళలకు, పెన్షనర్లకు అందజేసిన జగనన్నను మళ్లీ గెలిపించుకోవాలన్నారు. పొరపాటున చంద్రబాబుకు ఓటు వేస్తే జగనన్న పథకాలు రద్దు చేస్తారన్నారు. మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ 14 సంవత్సరాలు సీఎంగా ఉండి పేదలను పట్టించుకోని చంద్రబాబు ఇప్పుడు సంక్షేమ పథకాలు ఇస్తా నంటే ఎలా నమ్ముతామన్నారు. అధికారం కోసం బాబు ఎన్నికల ముందు మాయమాటలు చెబుతారన్నారు. ఇందుకు 2014 ఎన్నికల హామీలే ఉదాహరణ అన్నారు. రుణమాఫీ పేరుతో పొదుపు మహిళలు, రైతులను మోసం చేశారన్నారు. ఇవన్నీ ఆయా వర్గాలు నేటికీ మరిచిపోలేదన్నారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ సుజాత, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు సీహెచ్ మద్దయ్య, శేషు యాదవ్, కార్పొరేటర్ జుబేర్ అహమ్మద్ పాల్గొన్నారు.

8వ వార్డు పెద్ద పడఖానలో...

ఆదివారం రాత్రి స్థానిక 8 వ వార్డు పరిధిలోని పెద్ద పడఖానలో కర్నూలు అసెంబ్లీ అభ్యర్థి ఇంటింటికి ఇంతియాజ్ కార్యక్రమం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే ఎస్వీమోహన్ రెడ్డి, సీనియర్ నాయకులు తెర్నేకల్ సురేందర్‌రెడ్డి, సీహెచ్ మద్దయ్య, కిషన్‌లతో కలిసి వార్డులో విస్తృతంగా పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఇంతియాజ్ మాట్లాడుతూ తనకు ఉన్న పరిపాలన అనుభవంతో కర్నూలు నగరాన్ని ఆంధ్రప్రదేశ్‌లోనే నెంబర్ వన్ సిటీగా తీర్చిదిద్దుతానన్నారు. ఇందుకు ఎన్నికల్లో తనకు ఓటేసి గెలిపించాలని ప్రజలను కోరారు.

బాబును నమ్మితే మోసపోతాం

- చంద్రబాబు ఏ రోజూ పేదల ఆరోగ్యం, పిల్లల చదువును పట్టించుకోలేదు
- ఎన్నికల ప్రచారంలో కోడుమూరు ఎమ్మెల్యే అభ్యర్థి సతీష్, కుడా చైర్మన్ కోట్ల హర్ష



ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి డా.ఆదిమూలపు సతీష్

కర్నూలు సిటీ: టీడీపీ అధినేత చంద్రబాబు మాయ మాటలు నమ్మితే మోసపోవాల్సి వస్తుందని వైఎస్సార్‌సీపీ కోడుమూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలపు సతీష్ ప్రజలను హెచ్చరించారు. ఇచ్చిన మాట మీద నిలబడి మంచి చేసే నాయకుడు వైఎస్ జగన మాత్రమేనని, ఎన్నికల్లో ఆయనను మరోసారి గెలిపించుకొని సీఎం చేసుకుందామని పిలుపునిచ్చారు. ఆదివారం కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మణిగాంధీ, కొత్తకోట ప్రకాష్‌రెడ్డిలతో కలిసి ఆయన కర్నూలు అర్బన్ 38వ వార్డు గీతాముఖర్జీ నగర్, సమతా నగర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలిసి ఓట్లు అభ్యర్థించారు. అనంతరం వారు మాట్లాడుతూ దేశంలో ఎక్కడా కూడా ప్రభుత్వ పథకాలు నేరుగా ఇంటి వద్దకు రావడం లేదన్నారు. ఏపీలో మాత్రమే చెంతకు ప్రభుత్వ పథకాలు, సేవలు వస్తున్నాయన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన వలంటీర్, సచివాలయ వ్యవస్థలతో ఇది సాధ్యమైందన్నారు. గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని జగనన్న తీసుకురావడంతో చంద్రబాబు ఓర్వలేకపోతున్నారన్నారు. పేదలకు మేలు జరిగితే ప్రతిపక్ష నేత జీర్ణించుకోలేరని, ఎలాగైనా అడ్డుకోవాలని కుట్రలు పన్నుతారని మండిపడ్డారు. 2014 ఎన్నికల్లో అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేయని విషయం అందరికీ తెలిసిందేనన్నారు. ఇప్పుడు కూడా అలాగే హామీలు ఇచ్చి మోసం చేస్తారని.. ఆయన విషయంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. 14 ఏళ్ల సీఎం పనిచేసిన బాబు ఏ రోజూ పేదల ఆరోగ్యం, పిల్లల చదువును పట్టించుకోలేదన్నారు. వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాతే పేదలకు నాణ్యమైన విద్య, వైద్యం ఉచితంగా అందుతుందన్నారు. ఈ మంచి కొనసాగాలంటే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా బీవై రామయ్యను భారీ మెజార్టీతో గెలిపించాలని సతీష్ కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు విక్రం సింహారెడ్డి, సాంబ శివరావు, పాటిల్ హనుమంతురెడ్డి, సురేంద్రగౌడ్, నాగరాజు, మహేంద్ర గౌడ్, సద్దాం, శేషన్న, యువజన జిల్లా కార్యదర్శి గిరిప్రసాద్, వైఎస్సార్‌సీపీ మహిళ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ ఖాజాబీ, స్టాంటన్‌పురం సూరి, ఆనంద్ బాబు, వెంకటేష్, నజీర్, రామ్మోహన్ రెడ్డి, శివ శంకర్ నాయుడు, దామోదర నాయుడు, రాజశేఖర్ రెడ్డి, వెంకటేశ్వర్లు, ప్రసాదు, షాజహాన్, కార్యకర్తలు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీది ప్రజల మేనిఫెస్టో



వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టో కరపత్రాలు విడుదల చేస్తున్న బీసీ నేతలు

- చంద్రబాబు బూటకపు మాటలను ప్రజలు నమ్మరు
- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం సుభాష్ చంద్రబోస్

కర్నూలు(అర్బన్): రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విడుదల చేసిన మేనిఫెస్టోను నమ్ముతారే తప్ప చంద్రబాబు బూటకపు మాటలను నమ్మే పరిస్థితుల్లో ప్రజలు లేరని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం. సుభాష్ చంద్రబోస్ అన్నారు. ప్రజలకు తాము ఏమి చేస్తామనే విషయాలనే వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టోలో ప్రస్తావించారన్నారు. ఆదివారం స్థానిక బీసీ భవన్‌లో ఆ పార్టీ బీసీ విభాగం రాష్ట్ర కార్యదర్శి దేవపూజ ధనుంజయ ఆచారి, జిల్లా కార్యదర్శి బత్తుల లక్ష్మీకాంతయ్యతో కలిసి వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టో కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా సుభాష్ మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మేనిఫెస్టోను విడుదల చేశారన్నారు. తెలుగుదేశం అధినేత చంద్రబాబు నాయుడు ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన హామీలన్ని బూటకమని, ఆయన మాటలను ఎవరు నమ్మరన్నారు. ప్రజల ఆశీస్సులతో వచ్చే ఎన్నికల్లో అత్యధిక మెజారిటీ సాధించి రెండోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ ప్రమాణ స్వీకారం చేయడం ఖాయమన్నారు. వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టోను జిల్లాలోని ప్రతి గడపకు చేరే విధంగా ప్రచారం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పార్టీ బీసీ నేతలు కె.నాగేశ్వరి, చంద్రకళాబాయి, నస్నూర్‌బేగ్, చంద్రికమ్మ, మధు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన 'మంచం మీద పెళ్లి' నాటకం



సాంఘిక నాటకంలోని ఓ సన్నివేశం

కర్నూలు కల్చరల్: చిలకలూరి పేట మద్దుకూరి క్రియేషన్స్ కళాకారులు ప్రదర్శించిన 'మంచం మీద పెళ్లి ' సాంఘిక నాటకం అలరించింది. ప్రతి నెల చివరి ఆదివారం సాంఘిక నాటక ప్రదర్శనలో భాగంగా స్థానిక టీజీవీ కళాక్షేత్రంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ప్రముఖ నాటక రచయిత కాళ్లకూరి నారాయణ రావు జయంతిని నిర్వహించారు. కళాకారులు, సాహితీ వేత్తలు ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం జయంతి సందర్భంగా 'చింతామణి – భవాని ' సీనును ప్రదర్శించారు. ఈ సందర్భంగా విశ్రాంత కలెక్టర్, కళాకారులు బలరామయ్య మాట్లాడుతూ కాళ్లకూరి నారాయణ రావు రచనల్లో చింతామణి, వరవిక్రయం, మధుసేవ లాంటివి 150 సంవత్సరాల కింద సమాజంలో ఉన్న వేశ్య వృత్తి, మద్యపానం, అమ్మాయిలను అమ్ముకోవడం లాంటి సంఘ నిషేధితాలపై నాటకాలు రాశారన్నారు. నగరంలోని ప్రజలకు వినోద కార్యక్రమాలను అందిస్తూ ఆహ్లాదంగా గడిపేందుకు కళాక్షేత్రంలో ప్రతి ఆదివారం ఏదో ఒక కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం నాటకం దర్శకులు వెంకటేశ్వరరావుతో పాటు, కళాకారులు శ్రీనివాసరెడ్డి, రేణుకలను సన్మానించారు. మంచం మీద పెళ్లి నాటకం దర్శకుడికి రూ.20 వేల పారితోషికం అందజేశారు. కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కళాక్షేత్రం సభ్యులు, సీనియర్ కళాకారులు హెచ్. చంద్రన్న, దస్తగిరి, శేషయ్య, కార్యక్రమ కన్వీనర్లు సంగా ఆంజనేయులు, గాండ్ల లక్ష్మన్న, సమ్మర్‌క్యాంప్ కన్వీనర్ కరీముల్లా, రమణ, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి



కల్లూరు అర్బన్‌లో పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే కాటసాని సతీమణి ఉమామహేశ్వరమ్మ

పాణ్యం: టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరికలు కొనసాగుతున్నాయి. ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి సమక్షంలో కొండజుటూరు, నెరవాడ గ్రామలకు చెందిన టీడీపీ నాయకులు ఆదివారం వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి పార్టీ కుండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కొండజుటూరు గ్రామంలో పరంకి రజీవా, కానాల పవన్, నెరవాడ గ్రామానికి చెందిన నూక సుధీర్‌కుమార్‌రెడ్డి, నూక శ్రీనివాసరెడ్డి, మానవ శేషిరెడ్డి, దేవసాని శ్రీనివాసులు, దేవసాని రామసుబ్బయ్య, దూదేకుల మదార్‌సా, మాలే రాజశేఖర్, నీరజ్ సహా పలు కుటుంబాలు టీడీపీకి స్వస్తి చెప్పి వైఎస్సార్‌సీపీలో చేరాయి. టీడీపీలో కష్టపడేవారికి గుర్తింపు, గౌరవం లేదని.. ప్రజలకు మంచి చేస్తున్న జగనన్నకు అండగా ఉంటామని వారు తెలిపారు. కాటసాని విజయానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ లింగాల శారదమ్మ, నాయకులు ప్రతాప్‌రెడ్డి, రాంభూపాల్‌రెడ్డి, రమణారెడ్డి, శివారెడ్డి, జ్యోతిస్వరూప్‌రెడ్డి పాల్గొన్నారు. అలాగే బలపనూరు గ్రామంలో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డితో పాటు ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి తనయుడు పోచా జనార్ధన్‌రెడ్డి ఎన్నికల ప్రచారం చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకురాలు శశికళరెడ్డి, జెట్పీటీసీ సభ్యురాలు సద్దల సరళమ్మ, ఎంపీపీ ఉసేన్‌బీ, జెట్పీటీసీ మాజీ సభ్యుడు సద్ద సూర్యనారాయణరెడ్డి, వైస్ ఎంపీపీలు వెంకటేశ్వర్లు, పార్వతమ్మ, ఎంపీటీసీ సభ్యులు వరలక్ష్మీ, సర్పంచ్ మాధవి, నాయకులు భాస్కర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, రామచంద్రుడు, కరుణాకర్‌రెడ్డి, శ్రీనివాస రెడ్డి, నాగేంద్ర, జయచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక

కల్లూరు: కల్లూరు అర్బన్ 20వ వార్డు మాధవనగర్, లక్ష్మీనగర్‌కు చెందిన 20 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరాయి. ఆదివారం పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి సతీమణి కాటసాని ఉమామహేశ్వరమ్మ సమక్షంలో వారు పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. మాధవనగర్, లక్ష్మీనగర్‌కు చెందిన కృష్ణ, కార్తీక్, రాజు, కేశవ, శ్రీను, శివుడు, రామలక్ష్మి, రాణి, లక్ష్మీదేవి పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. అనంతరం ఉమామహేశ్వరమ్మ మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పేదల సంక్షేమమే ధ్యేయంగా సుపరిపాలన అందిస్తున్నారన్నారు. వచ్చే ఐదేళ్లు మరింత మేలు జరగాలంటే మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి పాణ్యం ఎమ్మెల్యే అభ్యర్థి కాటసాని రాంభూపాల్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు.

క్రీడలతో మానసిక ఆనందం

కర్నూలు (టౌన్) : క్రీడల వల్ల శారీరక, మానసిక ఆనందం కలుగుతుందని గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ శంకర్ శర్మ అన్నారు. ఆదివారం స్థానిక మున్సిపల్ ఉన్నత పాఠశాలలో సీలంభం వేసవి శిక్షణ శిబిరం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీలంభం మన దేశానికి చెందిన ప్రాచీన క్రీడ అన్నారు. ఈ క్రీడ వల్ల ఏకాగ్రత మానసిక, శారీరక ఆరోగ్య సామర్థ్యం పెరుగుతుందన్నారు.

కోలుకోలేక వివాహిత మృతి

వెల్దుర్తి(కృష్ణగిరి): ఆత్మహత్యకు యత్నించి కర్నూలు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మండల పరిధిలోని రామళ్లకోటకు చెందిన స్వాములు భార్య దాసరి చంద్రకళ(30) కోలుకోలేక ఆదివారం మృతిచెందింది. ఎస్‌ఐ చంద్రశేఖర్ రెడ్డి తెలిపిన వివరాలు.. కడుపు నొప్పి తాళలేక ఈనెల 17న ఇంట్లో పురుగు మందు తాగింది. కుటుంబ సభ్యులు గమనించి చికిత్స నిమిత్తం కర్నూలుకు తరలించారు. అక్కడ కోలుకోలేక మృతిచెందింది. మృతురాలి సోదరుడు సురేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. కాగా మృతురాలికి ముగ్గురు కూతుళ్లు ఉన్నారు.

దాడి కేసు నమోదు

వెల్దుర్తి(కృష్ణగిరి): మండల పరిధిలోని రామళ్లకోటకు చెందిన మహిళపై అసభ్యంగా ప్రవర్తించి ఆమె కుమారుడు, అల్లుడిపై దాడి చేసిన ఘటనలో ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చంద్రశేఖర్‌రెడ్డి ఆదివారం తెలిపారు. ఈనెల 25న మాసూంబీ ఇంటి వద్ద అదే గ్రామానికి చెందిన ఒకే కుటుంబీకులైన గొల్ల రామచంద్రుడు, గోపాల్, వెంకటేశ్, గణేశ్ మద్యం తాగుతూ అసభ్యంగా ప్రవర్తిసుండగా అడ్డు వచ్చిన మాసూంబీని దూషిస్తూ, కుమారుడు దస్తగిరి, అల్లుడు మహబూబ్‌బాషాలపై దాడి చేసి గాయపరిచారు. క్షతగాత్రులు వెల్దుర్తి ఆసుపత్రిలో చికిత్స పొందిన అనంతరం మాసూంబీ ఫిర్యాదు మేరకు దాడి చేసిన వారిపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యుత్ సరఫరాకు చంద్రబాబు ఎఫెక్ట్

- 4 గంటల పాటు నిలిచిన సరఫరా

మంత్రాలయం: అసలే వేసవి.. ఊపిరి ఆడనంతగా ఉక్కపోత. ఫ్యాన్లు ఆడకపోతే ఉక్కిరిబిక్కిరయ్యే పరిస్థితి. కాసేపు కరెంట్ లేదంటే తలలు పట్టుకునే తరుణం. ఇలాంటి సమయంలో కౌతాళం వాసులకు చంద్రబాబు చిర్రెత్తించారు. ఆయన రోడ్‌షో కారణంగా కౌతాళం మండల కేంద్రంలో విద్యుత్ సరఫరాకు గంటల తరబడి అంతరాయం ఏర్పడింది. సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు కరెంటు లేక మండల వాసులు అవస్థలు పడ్డారు. ఉక్కపోతతో అల్లాడిపోవడమే గాక వ్యాపారాలు, ఇతర కార్యకలాపాలకు అంతరాయం కలిగింది. చంద్రబాబు రోడ్‌షో సందర్భంగా విద్యుత్ తీగలకు సమీపంలో సౌండ్ బాక్సుల స్టాండ్‌ను అమర్చడమే ఇందుకు కారణం. కాస్త దూరంగా సౌండ్ సిస్టం ఏర్పాటు చేసి ఉంటే విద్యుత్ సరఫరా త్వరగా పునరుద్ధరించేవారు. దీనికితోడు కార్మికులు స్టాండ్‌ను తొలగించడంలో ఆలస్యం చేయడంతో గంటల తరబడి అంతరాయం కలిగింది. అలాగే చంద్రబాబు పర్యటన నేపథ్యంలో జెడ్పీ పాఠశాల ముఖద్వారంలో పచ్చని చెట్లను నరికారు. చిన్న చిన్న కొమ్మలను సైతం వదలకుండా జేసీబీతో తొలగించారు.

పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

గోనెగండ్ల: మండల పరిధిలోని హెచ్.కైరవాడి గ్రామానికి చెందిన బోయ పెద్ద లక్ష్మన్న (64) కడుపునొప్పి తాళలేక పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు సీఐ రామకృష్ణయ్య తెలిపారు. సీఐ తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన బోయ పెద్ద లక్ష్మన్న గత కొద్ది రోజులుగా కడుపునొప్పితో బాధపడుతుండేవాడు. జీవితంపై విరక్తి చెంది శనివారం మధ్యాహ్నం ఇంట్లో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. కోలుకోలేక శనివారం రాత్రి మృతిచెందినట్లు తెలిపారు. మృతుడి కుమారుడు వెంకటేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. మృతుడికి భార్య లక్ష్మీదేవమ్మ, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

ఎంసీసీ నివేదికలను వెంటనే పంపాలి



నోడల్ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న జనరల్ అబ్జర్వర్లు జాఫర్ పి.సి, మీర్ తారిఖ్ అలీ

కర్నూలు కల్చరల్: ఎంసీసీ ఎన్నికల కంప్లెయింట్స్, సీ విజిల్, సీజర్‌కి సంబంధించిన నివేదికలను వెంటనే పంపించే విధంగా చర్యలు తీసుకోవాలని జనరల్ అబ్జర్వర్లు జాఫర్ పి.సి, మీర్ తారిఖ్ అలీ సంబంధిత నోడల్ అధికారులను ఆదేశించారు. ఆదివారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజనతో కలిసి ఎన్నికల నిర్వహణ అంశాలపై అన్ని నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు, నోడల్ అధికారులతో వారు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అబ్జర్వర్లు మాట్లాడుతూ ఎన్నికల సంఘం సూచనల మేరకు జిల్లాలో ఎన్నికల సన్నద్ధత, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలు తదితర అంశాలను పరిశీలిస్తున్నామన్నారు. ఇప్పటి వరకు 17 గ్రామాల్లోని 20 పోలింగ్ కేంద్రాలను పరిశీలించామన్నారు. ఎన్నికల విధులు నిర్వర్తించే ప్రతి ఉద్యోగి నియమ నిబంధనలు పాటిస్తూ విధులను అప్రమత్తంగా నిర్వర్తించాలని ఆదేశించారు. ఎన్నికల నిర్వహణపై తీసుకుంటున్న చర్యలను జిల్లా కలెక్టర్ అబ్జర్వర్లకు వివరించారు. సమావేశంలో పాణ్యం రిటర్నింగ్ అధికారి, జేసీ నారపురెడ్డి మౌర్య, కర్నూలు రిటర్నింగ్ అధికారి, నగరపాలక సంస్థ కమిషనర్ భార్గవ తేజ, ఆదోని, కోడుమూరు, పత్తికొండ, ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆలూరు రిటర్నింగ్ అధికారులు శివ్‌నారాయణ్ శర్మ, శేషిరెడ్డి, రామలక్ష్మి, చిరంజీవి, మురళి, రాము నాయక్, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ చల్లా కల్యాణి, నోడల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పురుగులు, తెగుళ్లను సకాలంలో నివారించుకోవాలి

- అప్పుడే దిగుబడులు తగ్గకుండా వస్తాయి
- దేశీ శిక్షణ కార్యక్రమంలో ఆత్మ ఏఓ మధుమతి



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆత్మ ఏఓ మధుమతి

కర్నూలు(అగ్రికల్చర్): వివిధ పంటలకు సోకే పురుగులు, తెగుళ్లను సకాలంలో నివారించుకుంటేనే మంచి దిగుబడులు పొందే అవకాశం ఉందని జిల్లా వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ(ఆత్మ) ఏఓ మధుమతి తెలిపారు. చీడపీడల లక్షణాలు, వాటి నివారణ పద్ధతులపై అవగాహన పెంచుకొని రైతులకు చక్కటి సలహాలు ఇవ్వాలని ఇన్‌పుట్ డీలర్లకు సూచించారు. ఆదివారం వ్యవసాయ శాఖ కర్నూలు ఏడీఏ కార్యాలయంలో దేశీ డిప్లొమ కోర్సు కింద ఇన్‌పుట్ డీలర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఏఓ పురుగులు, తెగుళ్ల లక్షణాలు, నివారణ పద్ధతులపై అవగాహన కల్పించారు. పురుగులు, తెగుళ్లను నిర్లక్ష్యం చేస్తే పంట నాణ్యత తగ్గి దిగుబడులపై ప్రభావం పడుతుందన్నారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారుల సిఫారస్సులతో పురుగుమందులు పిచికారీ చేయాలని సూచించారు. పోషకాల లోపం వల్ల పంటలు దెబ్బతింటే వాటి లోపాలను సవరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విశ్రాంత జేడీఏ, దేశీ కార్యక్రమ సమన్వయకర్త జయచంద్ర వివిధ మండలాల ఇన్‌పుట్ డీలర్లు పాల్గొన్నారు.

వైభవంగా దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠ



కలశాలను ఊరేగింపుగా తీసుకెళుతున్న భక్తులు

గూడూరు రూరల్: మండల పరిధిలోని పెంచికలపాడులో నూతన ఆలయాల్లో దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఆదివారం వైభవంగా జరిగింది. గ్రామ పెద్దలు, ప్రజల ఆధ్వర్యంలో ప్రాతఃకాలపూజ, యంత్రపూజ, అర్చన, యంత్ర ప్రతిష్ఠ, విగ్రహ ప్రతిష్ఠ, హోమాలు, అష్టబంధన విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ, కుష్మాండబలి, కక్షజ్వాల, గోదర్శనం, మంగళహారతి, పూర్ణాహుతి, కలశ ఉద్వాసన, ప్రోక్షణ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. కొత్తగా నిర్మించిన దేవాలయాల్లో ఏర్పాటు చేసిన గణపతి, కుమారస్వామి, కాశీ విశ్వనాథస్వామి, నందీశ్వరుడు, ఆంజనేయస్వామి విగ్రహాల ప్రతిష్ఠ చేసేందుకు స్థానిక శివాలయం నుంచి మంగళవాయిద్యాలతో కలశాలను తీసుకొచ్చారు. వేదమంత్రోచ్ఛారణలు, శాంతి హోమాల మధ్య బ్రహ్మశ్రీ వెంకటరమణశర్మ ఆధ్వర్యంలో ప్రాణప్రతిష్ఠ శాస్త్రోక్తంగా జరిగింది. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

మే 22 నుంచి ఇంటర్ అడ్మిషన్లు

ఆదోని సెంట్రల్: ఇంటర్మీడియెట్ అడ్మిషన్లు మే 22వ తేదీ నుంచి జరుగుతాయని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వి.సంజన్న ఆదివారం తెలిపారు. కళాశాలలో చేరదలచిన విద్యార్థినులు మే 15వ తేదీ నుంచి అప్లికేషన్ ఫారంలు తీసుకొని దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థినులకు మే 22వ తేదీ నుంచి జూన్ 1వ తేదీ వరకు అడ్మిషన్లు జరుగుతాయని తెలిపారు. తరగతులు జూన్ 1వ తేదీ నుంచే ప్రారంభమవుతాయని వెల్లడించారు. సప్లిమెంటరీ పరీక్షలు రాసిన విద్యార్థులకు జూన్ 1వ తేదీ నుంచి 10వ తేదీ వరకు అడ్మిషన్లు జరుగుతాయన్నారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.